# మసిబారిన మాణిక్యం

రచన:
శ్రీ శ్రీరంగంపల్లె

ఉదయం కాఫీ తాగుతున్న మూర్తికి పోస్టుమేన్ వచ్చి జాబులిచ్చి వెళ్ళాడు. అన్ని జాబుల్లోకి అతన్ని ఆకర్షించిందో కవరు. కవరు 9 అం॥ పొడవుతో చాలా బరువుంది. గవర్నమెంటువారి దగ్గరనుండేమయినా వచ్చిందేమోనని, రబ్బరుస్టాంపు కోస మెతికాడు. కనపడలేదు. తనకు ఇంత పెద్దజాబు రాసేదెవరా అని కవరు ఓపెనుచేసి అందులో ఉన్న నాలుగు షీట్ల కాగితాలు తీసి, దస్తూరి చూశాడు. అక్షరాలు చూస్తుంటే రమదిలా ఉంది. క్రింద సైన్ చూశాడు. అవును, అక్షరాలా ఆ లెటరు రమ రాసిందే. రమ తనకు లెటరు వ్రాయడమే ఆశ్చర్యకరము. అందులోనూ ఇంత పెద్ద లెటరు రాసిందంటే ఏదో విశేషముంటుందని ఆత్రుత పట్టలేక గబగబా చదువసాగాడు.

తిరుపతి,
20-9-'68.

ప్రియమైన బావగారికి మరదలు రమ నమస్కరించి వ్రాయునది. నువ్వూ, పద్మా, బాబు క్షేమంగా ఉన్నారని తలుస్తున్నాను. నా దగ్గరనుండి ఇంత పెద్ద జాబు వచ్చిందంటే ఆశ్చర్యంగా ఉంది కదూ!

బావా! నేను ఎనిమిది సం॥ క్రితము నా జీవితంలో కెల్లా పెద్ద పొరపాటుచేశాను. ఆనాడు ఆ పొరబాటు చేయడానికి పట్టిన కాలము క్షణమే. కానీ, ఇప్పుడు దానికి ఫలితంగా నా బ్రతుకే వ్రక్కలయ్యింది. ఆనాడు నేనా పొరబాటు చేయకుండా ఉంటే నేనీనాడు నీకిలా ఉత్తరం రాసే అవసర ముండియుండదు.

ఎనిమిదేళ్ళకు ముందు నువ్వు 'నన్ను పెండ్లి చేసికొమ్మని' నన్ను అడిగావు. అప్పటికి నేను బి. యస్.సి పాసయినాను. కానీ నువ్వు అంతకు నాలుగు సం॥ క్రితము మీ నాన్నగారు పోవడంతో పి.యూ.సి. తో నువ్వు చదువు నిలిపేసి వ్యవసాయంలోకి దిగావు.

'చదువూ, సంధ్యలేని నీవంటివాడు కట్టుకొని నా యావజ్జీవితము ఆ పల్లెల్లో వంటయింటి కుందేల్లా పడి ఉండలేను. నాకు క్లబ్బులు, సినిమాలు, పార్టీలు, సంఘాలు, సమావేశాలు ఇలాంటివన్నీ ఉండాలి. కల్చర్ అంటే తెలీని నీలాంటివాడివి ఇవన్నీ ఎలా సమకూరుస్తావు' అంటూ నిన్ను పెండ్లిచేసికోనని నిక్కచ్చిగా చెప్పేశాను.

అప్పటికీ నీవు కోపగించుకోలేదు. పైగా 'రమా! నువ్వు నాకంటే చదువులో, సంస్కారంలో ఎక్కువే కాదనను. కానీ నువ్వు నాక్కావాలి. చిన్నప్పటినుండి నీమీదే ఆశలు పెంచుకొన్నాను. వాటిని త్రుంచి వేయకు. నీకోసం, నీ సుఖంకోసం నే నేమయినా చేయగలను. నీకు క్లబ్బులు, సినిమాలు కావాల్సియుంటే నా ఆస్థంతా అమ్మేసి హైదరాబాదులో కాపురం పెడతాను, ఏమంటావు' అంటూ ప్రాధేయపడ్డావు.

నే నలా కసురుకొన్నా నీ వలా కోపగించుకోక నన్నింకా అర్థించడం చూస్తుంటే, నాకు భిక్షం వేసే వరకూ వేధించే భిక్షగాడు జ్ఞప్తికి వచ్చిందా క్షణంలో. 'ఒక ఆడది 'ఛీ' యని తోసివేసినా దాని కాళ్ళవెంబడి పడే నీలాంటి వారంటే నా కసహ్యం' అంటూ చీదరించుకొంటూ వెళ్ళిపోయాను.

నాపై అంతగా మరులుగొని నన్ను పువ్వుల్లో పెట్టి దేవతలా చూసుకొంటానన్న నీలాంటి ప్రేమమూర్తిని వలదన్న నా మిడిసిపాటుకు, శిక్షగా దేవుడు నా జీవితం దుఃఖభాజనం చేశాడు.

నిన్ను తిరస్కరించిన ఆరుమాసాలకే మా నాన్న హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న ఇంజనీరుకు, నాకూ వివాహం జరిపించేశారు. దిగాలుపడిన ముఖంతో నీవు నామీద అక్షింతలు చల్లుతూంటే నీ ముఖంచూసి నాకు నవ్వువచ్చింది. 'ఇలాంటి ఏ ఇంజనీరుకో భార్యనై, పట్నవాసిగా, రాణిలా బ్రతుకవలసిన నన్ను, పల్లెల్లో ఉంచుతానన్న నీ వెర్రికి నాకు నవ్వువచ్చింది. కానీ, 'నాకు భార్య కావలసినది వేరెవరికో భార్య అవుతున్నదే' అని నీవు పొందే వ్యథను అర్థం చేసికోలేకపోయాను ఆనాడు.

పెండ్లయిన ఆరుమాసాలవరకూ హనీమూన్ ట్రిప్‌లో భారతదేశమంతా తిరిగేశాము. కాశ్మీరు, కొడైకెనాల్, బెంగుళూరు, డార్జిలింగు...ఒకటేమిటి, మేము తిరగని ప్రదేశంలేదు. ఆరుమాసాలు ఆరు నిమిషాలుగా గడచిపోయాయి. ఇలాగే జీవితమంతా సంతోషంగా గడపాలని అనుకొన్నాను.

హైదరాబాదుకు తిరిగివచ్చిన తర్వాత ప్రతిరోజూ నన్ను క్లబ్బులకో, సినిమాలకో, పార్టీలకో లాక్కెళ్ళేవాడు. రోజూ ఏదో ఒక 'బయస్కోపు' లేకుంటే దినం గడిచేదికాదు.

ఒకనాడు నీవు పంపిన నీ పెండ్లిపత్రిక చూశాను. పెండ్లికూతురు ఎవరో పద్మట. రోజూ ఏ మంత్రి కుమార్తెతోనో, సెక్రటరీ భార్యతోనో తిరిగే నాకు నీవు చాలా అల్పుడివిగా అగపడ్డావు. నీలాంటివాడి పెండ్లికి వెళ్ళడం నామోషీ అనుకొన్నాను. తుదకు నేను లేకనే నీ పెండ్లి జరిగిపోయింది.

క్రమక్రమంగా మావారికి దుర్వ్యసనాలు అలవడసాగాయి. మానాన్న యిచ్చిన కట్నంతాలూకు రెండు లక్షలు ఉండడంవల్లా, బెల్లంచుట్టూ చేరిన చీమల్లా, స్నేహితులమంటూ, మావారిచుట్టూ చాలా మంది చేరారు. రానురాను నన్ను కన్నెత్తయినా చూడడం మానివేశారు. ముక్కులవరకూ తాగి, ఎవతెనో వెంటేసుకొని, ఏ హోటల్లోనో గడిపి, అర్ధరాత్రి యింటికొచ్చి తలుపుకొట్టడం రివాజయిపోయింది అతనికి.

మొదట్లో అతని ప్రవర్తన నాకు బాధాకరంగా వుండినా, కాలం గడిచేకొద్దీ నా క్లబ్బులు, సినిమాలు, పార్టీలులాంటివాటిలో పడిపోయి అతని సంగతే మరచిపోయాను. ఎవరి తిరుగుళ్ళు వారివిగా, ఎవరి జల్సాలు వారివిగా, ఎవరి బ్రతుకులు వారివిగా మెలగజొచ్చాము.

ఇలా యిద్దరూ జల్సాలకు ఖర్చు పెట్టుండడంవల్లా మా నాన్నిచ్చిన రెండులక్షల రూపాయలు హారతి కర్పూరమయిపోయింది. నా ఒంటిమీద నగలు దాదాపు లక్షరూపాయలు చేసేవి, మార్వాడీ కొట్టు చేరుకొన్నాయి. క్రమంగా కారు, ఇంట్లో ఫర్నిచరు అమ్మేశాము.

ఇప్పుడు ఏ ఒక్కరూ జల్సాచేయడానికి కూడ కానీ లేకపోయింది. అలవాటును మానుకోలేక తెలిసినవారందరి దగ్గరా అప్పులు చేయసాగాము. ఇలా ఇద్దరు కర్చుపెడ్తే డబ్బెక్కడినుంచి వస్తుందని మావారు నన్ను క్లబ్బులకు, మరెక్కడికీకూడ వెళ్ళకూడదని ఆంక్ష విధించారు. నిర్లక్ష్యంచేసి వెళ్ళిననాడు ఒడితె పూజ జరిగేది. ఈ దెబ్బల భయంగా ఇల్లువదలి బయటకు వెళ్ళడం మానివేశాను.

డబ్బులేక సరిగా జీతాలివ్వనందున ఇంట్లో నౌకర్లందరూ పనికి నిలచిపోయారు. ఏనాడూ పూచిక పుల్లెత్తి పనిచేయని నామీద బండెడు చాకిరీ పడింది. ఆయనగారి బలవంతంవల్లా ఆ చాకిరీ అంతా చేయసాగాను.

ఇంతలో హైదరాబాదులో గుర్రపుపందాలు మొదలవ్వడంతో పరిస్థితి ఇంకంత విషమించింది. ఉన్న కొంపనికూడ రెండులక్షల కమ్మివేసి అద్దెకొంపలో కాపురముంచి, ఆ డబ్బు గుర్రపు పందాలకు తగలేశారు.

పుట్టింటినుండి డబ్బు తీసుకురమ్మని నన్ను ప్రతిసారి మా ఊరుకు తరిమేవారు. నాన్న కొన్నిదఫాలు ఇచ్చారు. ఒకనాడు 'ఇది ఉమ్మడి కుటుంబము. నువ్వొక్కతవే కాదు నాకు కూతురివి. నీ వెనుక నీ తమ్ముళ్లు, చెల్లెళ్లూ వున్నారు. నీకిలా కట్నాలు, కానుకలతో పెండ్లిచేసిన తర్వాతకూడ డబ్బెగాయాలంటే నావల్ల కాదని' ఆయన నిష్కర్షగా చెప్పివేశారు.

మన్నికకూ, నాణ్యమునకూ, సరైన కొలతకు

# ఒలింపిక్ బనియన్లు

ప్రసిద్ధి చెందినది.

తయారించువారు

ఒలింపిక్ నిట్టింగ్ కంపెని, తిరపూరు-4

వట్టిచేతుల్తో తిరిగొచ్చిన నన్ను 'నాకే డబ్బులు లేకుండా వుంటే ఇంక నిన్నెవరు పోషించేది' అంటూ పుట్టింటికే తరిమేశారు. ఇప్పుడిక్కడ తోడబుట్టిన వారందరి సూటిపోటు మాటలు భరిస్తూ గతిలేక పడి వున్నాను.

మా ఆయన దగ్గరవున్న డబ్బంతా అయిపోయిన నాడు, ఇప్పుడు స్నేహితులుగా, ప్రియురాళ్ళుగా నటించేవాళ్ళందరూ ముఖం చాటు చేసికొన్న నాడు మావారు పశ్చాత్తాపపడి తిరిగి నన్ను చేరదీస్తారనే ఒకే ఒక్క ఆశమాత్రం వుంది. అలా జరగనినాడు...భగవాన్! ఆ భయంకర పరిణామం ఊహించడానికికూడ ఘోరంగా వుంది.

నీ గురించి నాన్న చెప్తూంటే ఒకరోజు విన్నాను. నీ భార్య పద్మ ప్రోత్సాహంతో నువ్వు ప్రయివేటుగా కూర్చొని బి.ఏ. పాసయ్యావనీ, ఇంటిదగ్గర బీడుగా పడివున్న భూములంతా నువ్వు సాగుచేయించి సంవత్సరాదాయము బాగా పెంచావనీ, పోయిన సంవత్సరము నీవు పెంచిన మామిడితోపుకుగాను నిన్ను భారత ప్రభుత్వం 'ఉద్యాన పండిత్' బిరుదునిచ్చి సత్కరించిందనీ, ఇప్పుడు నువ్వు సమితి ప్రెసిడెంటువనీ, స్టేటు లెవల్లో నీకు మంచి పలుకుబడి వుందనీ, మదరాసు, బెంగుళూరు, హైదరాబాదుల్లో వుండే అన్ని పెద్ద క్లబ్బులలోనూ నీవు మెంబరువనీ,

బావా! నాన్న ఇంకో విషయంకూడ చెప్పారు. నీవింత ఉచ్ఛస్థితికి రావడానికి నీకు పద్మ తగిన ఉత్సాహం, శ్రద్ధా కలుగజేసిందనీ,

ఇదంతా నాన్న చెప్పేటప్పుడు వింటూయుంటే ఒకనాడు నేను తిరస్కరించిన మూర్తి బావేనా, యీనాడు ఇంత స్థితికి వచ్చాడని ఆశ్చర్యపడ్డాను. ఎనిమిదేళ్ళకు ముందు నువ్వు మసబారిన మాణిక్యమని తెలియక, బొగ్గని భ్రమిసి చేతిలోవున్నదానిని విసిరివేసాను. మా ఆయనను నకిలీ వజ్రమని తెలియక వజ్రమని భ్రమసి చేపట్టాను. పద్మ పైనున్న మసిని కడిగివేసి, సానబెట్టి, మాణిక్యాన్ని ప్రకాశవంతం చేసికొంది. నేను చేపట్టిన వజ్రం కాలక్రమేణ వన్నె తరిగిపోయి, అసలు సరుకు బయటపడింది.

నిన్నింతవానిగా చేసిన మా చెల్లెలు పద్మను, నీ కొడుకును చూడాలనివుంది. తప్పకుండా దారినితీసికొని తిరుపతికి వస్తావు కదూ. పద్మకు, బాబుకు నా ఆశీర్వాదములు తెలిపేది.

నీ మరదలు,
"రమ"

# కేలండేటర్

రచన: పి, పోస్ట్‌కా

ఐక్యరాజ్య సమితిలోని భారత ప్రతినిధి 1953 అక్టోబరులో ప్రపంచమంతటకీ కలిసి ఒకే ఒక కేలెండర్‌ను సమితి తయారుచేయాలని సూచించాడు. ఇందువలన ఇప్పుడు వివిధ దేశాలలో అమలులోవున్న విభిన్నమైన కాలెండర్ల స్థానే సర్వత్రా ప్రామాణికమైన ఒక కేలెండరుంటుందని ఆయన అన్నాడు. ఈజిప్టు, బేబిలోనియా, చైనాలకు వలెనే భారతదేశంలోనూ బహుపురాతన కాలంలోనే కేలెండరు (పంచాంగం) ఉపయోగంలో వుండేది.

ఇప్పుడు విరివిగా అమలులో వున్న 'క్రిస్టియన్' కేలెండర్‌ను 1582 లో పోప్ గ్రిగరాచే ప్రవేశపెట్ట బడింది. ఇదికూడా దోషరహితమైనది కాదు. దీనిప్రకారమయితే కేలెండరు సంవత్సరానికీ, ఖగోళసంవత్సరానికీ మధ్య 26 సెకెండ్ల తేడా వస్తుంది; అనగా 3300 సంవత్సరాలకు పూర్తిగా ఒక్కదినం వ్యత్యాసం వస్తుంది. అదీగాక ఈ కేలెండర్‌ని నెలల మధ్యపావు సంవత్సరాలమధ్య వ్యత్యాసాలున్నాయి.

ఒకేమాదిరి సంవత్సరాలు 28 ఏళ్ళకోసారి తప్ప రావు గనుక ప్రతిసంవత్సరమూ క్రొత్త కేలెండర్లను ముద్రించాలి.

1954 ఐక్యరాజ్యసమితి భారత ప్రతినిధి చేసిన ప్రతిపాదనను చర్చించి, ప్రపంచమంతటికీ వర్తించే కేలెండర్ ఒకదానిని రూపొం